సాక్షి
కుమురం భీం

సోమవారం । 27 । మార్చి । 2023



పోషకాహారంపై అవగాహన

ఐదో విడత పోషణ పక్వాడ కార్యక్రమం ప్రారంభమైంది. ప్రజలకు పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్నారు.

9లో▸

దిక్సూచిలా సమాచార దీపిక

ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించేందుకు ఆశ్రమ పాఠశాలల్లోని 'పది' విద్యార్థులకు సమాచార దీపికలు అందించనున్నారు.



10లో▸

గరిష్టం/కనిష్టం
37.1 /22.4

వాతావరణం

ఆకాశం చాలా వరకు మేఘవృతమౌతుంది. మధ్యాహ్నం ఎండ, వేడి ఉంటుంది. సాయంత్రం పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
సోమ : 6:35	మంగళ : 4:51

పులుల మృత్యుఘోష!

- 'కవ్వాల్'లో ఆగని మరణాలు
- వేటగాళ్ల ఉచ్చుకు టైగర్లు బలి
- తాజాగా బెల్లంపల్లి పరిధిలో మరొకటి..
- ఐదేళ్ల క్రితమే చంపినట్లు నిర్ధారణ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: వేటగాళ్ల ఉచ్చుకు మరో పులి బలైంది. కవ్వాల్ పరిధిలో సగటున రెండేళ్లకో పులి చనిపోతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. తాజాగా బెల్లంపల్లి డివిజన్ కుశ్నపల్లి రేంజ్ నెన్నెల సెక్షన్, రంగపేట బీట్ పరిధిలో ఓ పులిని విద్యుత్ ఉచ్చుతో హతమార్చినట్లు వెలుగుచూసింది. దాని అవశేషాలు పాతిపెట్టి గోర్లు విక్రయిస్తుండగా దుండగులు అటవీశాఖ టాస్క్‌ఫోర్స్‌కు చిక్కారు. ఈ పులిని చంపి కొంతకాలంగా ఎవరికంట పడకుండా తప్పించుకున్నారు. అయితే పులి గోర్లు విక్రయానికి వచ్చాయనే పక్కా సమాచారంతో తనిఖీలు చేపట్టగా ఇది బయటపడింది. దీనిని కొన్నేళ్ల క్రితమే చంపినా అటవీ అధికారులకు సమాచారం లేకపోవడం ఆ శాఖ నిర్లక్ష్యాన్ని తెలియజేస్తోంది.

చనిపోయింది ఏ పులి?

గడిచిన ఐదేళ్లుగా దాదాపు నాలుగైదు పులులు కనిపించకుండా పోయాయి. కే6, ఏ2, జే1తో పాటు కాగజ్‌నగర్‌లో రెండుదఫాల్లో ఎనిమిది పిల్లలకు జన్మనిచ్చి 'సూపర్ మామ్'గా పేరొందిన 'పాల్గుణ' జాడ కూడా కనిపించడం లేదు. వీటిలో కొన్ని మహారాష్ట్రకు వెళ్లిపోయాయని చెబుతూ అధికారులు తప్పించుకుంటున్నా వాస్తవానికి ఏ పులి ఎక్కడ తిరుగుతుందో స్పష్టత లేకపోవడం గమనార్హం.



మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం పిన్నారంలో పాతిపెట్టిన పులి కళేబరం(ఫైల్)

ఎడ్లబండిలో తీసుకెళ్లి పాతిపెట్టి..

విద్యుత్ కంచెకు తగిలి చనిపోయిన పులి కళేబరాన్ని అతికష్టం మీద ఆరుగురు ఎత్తి ఎడ్లబండిలో తీసుకెళ్లి ఎల్లారం అటవీప్రాంతంలోని చెరువు సమీపంలో పాతిపెట్టారు. చనిపోయిన ఈ పులి వయస్సు మూడేళ్లకు పైగా ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ఇటీవల అటవీ అధికారులు పోడు భూముల సర్వే పనుల్లో బిజీగా ఉన్నారు. మరోవైపు సిబ్బంది కొరత, ఉన్నవారు కూడా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో పులులకు రక్షణ లేకుండా పోతోందనే వాదనలు ఉన్నాయి.

విద్యుత్ కంచెలకు పులులు బలి..

వన్యప్రాణులను వేటాడేందుకు సులువైన సాధనంగా వేటగాళ్లు రాత్రి వేళ విద్యుత్ కంచె ఏర్పాటు చేస్తున్నారు. ఆ సమయంలో పులి ఆ వైరును తాకితే సెకండ్లలోనే ప్రాణాలు కోల్పోతుంది. ఇలా కవ్వాల్ టైగర్ రిజర్వ్ పరిధిలో అనేక ఘటనలు చోటు చేసుకున్నాయి. చనిపోయిన పులి అవశేషాలు విక్రయించే క్రమంలో మాత్రమే ఇవి బయటపడుతున్నాయి.



బెల్లంపల్లి డివిజన్ కుశ్నపల్లి రేంజ్‌లో లభ్యమైన పులి అవశేషాలు

ఉమ్మడి జిల్లాలో హతమైన పులుల వివరాలు..

- 1985లో తొలిసారిగా కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోని కాగజ్‌నగర్ డివిజన్‌లో సిర్పూర్ నుంచి మాకోడి రైల్వేట్రాక్‌పై ఒక పులి కళేబరం కనిపించింది.
- 2006లో బెజ్జూర్‌లోని పాపన్నపేటలో వేటగాళ్లు పులిని చంపేశారు.
- 2011లో కాగజ్‌నగర్ మండలం ఊట్‌పల్లి చెరువు వద్ద పెద్దపులిని హతమార్చారు. చర్మం, గోర్లను తరలిస్తుండగా అధికారులకు పట్టుబడ్డారు.
- 2010 అక్టోబర్‌లో సిర్పూర్, కౌటాల మండలాలకు చెందిన నలుగురు వేటగాళ్లను మహారాష్ట్రలోని చంద్రాపూర్ పోలీసులు అదుపులోకి తీసుకుని ఇక్కడి అటవీ అధికారులకు అప్పగించారు. విచారణలో హైదరాబాద్ నుంచి పులి చర్మం తీసుకొచ్చినట్లు ఒప్పుకొన్నారు.
- 2014లో చెన్నూరులో పెద్దపులి చర్మం లభ్యమైంది. కారకులను అరెస్ట్ చేశారు.
- 2016లో కాగజ్‌నగర్ డివిజన్ బెజ్జూర్ మండలం ఏటిగూడ సమీపంలో పులి చర్మాన్ని అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు వేటగాళ్లు సరిహద్దున గల మహారాష్ట్ర నుంచి పులిచర్మంతో వస్తుండగా అరెస్ట్ చేశారు. ఈ పులి చర్మాన్ని బెజ్జూరు రేంజ్‌లోని అటవీశాఖ భవనంలో భద్రపరచగా ఆ శాఖ ఉద్యోగే మాయం చేశాడు. తన ఇంట్లోనే దాచి విక్రయించేందుకు యత్నించే క్రమంలో పట్టుబడ్డాడు.
- 2016లో చెన్నూరు డివిజన్ కోటపల్లి మండలం పిన్నారం రైతులు పొలాల వద్ద అమర్చిన విద్యుత్ కంచెకు తగిలి ఓ పులి చనిపోయింది.
- 2017 జూలైలో మంచిర్యాల జిల్లా జన్నారానికి చెందిన ఐదుగురు రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసర్‌లో పోలీసులకు పట్టుబడ్డారు. పులి చర్మాన్ని హైదరాబాద్‌లో విక్రయించేందుకు వస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.
- 2019 జనవరిలో మంచిర్యాల జిల్లా శివ్వారంలో అమర్చిన విద్యుత్ వైరుకు తాకి రాయల్ బెంగాల్ టైగర్ ప్రాణాలు కోల్పోయింది. అప్పుడు కూడా పులి చర్మం, గోళ్లు అమ్ముతుండగా ఘటన వెలుగులోకి వచ్చింది.
- చెన్నూరు పరిధిలో వేటగాళ్లు అమర్చిన ఉచ్చు కే-4 అనే ఆడపులి నడుముకు తగిలింది. ఆ పులి జీవించి ఉందా? లేదా? ఇప్పటికీ తేలడం లేదు.

గడువులోగా సీసీరోడ్లు పూర్తి చేయాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే



పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్‌అర్బన్: నిర్దేశించిన గడువులోగా జిల్లాలో సీసీ రోడ్ల పనులు పూర్తి చేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఆసిఫాబాద్ మండలం సాలెగూడ పంచాయతీ పరిధిలోని భాగ్యనగర్ కాలనీలో రూ.5లక్షల వ్యయంతో నిర్మిస్తున్న రహదారి పనులతోపాటు వాంకిడి మండలం తేజాపూర్ పంచాయతీ పరిధిలో ఘాట్ జనగాంలో రూ.5లక్షల ఉపాధిహామీ నిధులతో చేపట్టిన సీసీరోడ్ల పనులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కేటాయించిన పనులను మార్చి చివరి వరకు పూర్తి చేయాలన్నారు. పనులపై నిత్యం పర్యవేక్షణ ఉంటుందని పేర్కొన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ ఏఈలు శివ, రాంకిరణ్ తదితరులు ఉన్నారు.

వాసవీమాతకు పూజలు



అఖండ దీపారాధన చేస్తున్న భక్తులు

కౌటాల(సిర్పూర్): కౌటాల మండలం సదాశివపేట కాలనీలోని శ్రీవాసవీ మాత ఆలయంలో ఆదివారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ వాసవీమాత అమ్మవారి పీఠం అర్చకులు బుక్క శ్రీనివాస్ ఆధ్వర్యంలో అఖండ దీపారాధన చేశారు. మహిళలు 102 రకాల ప్రసాదాలను అమ్మవారికి సమర్పించారు. ఆలయ అర్చకులు మహేశ్ శర్మ, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

'చలో ఢిల్లీ' విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, మతోన్మాద అనుకూల విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న ఢిల్లీలో నిర్వహించే మజ్దూర్ కిసాన్ ర్యాలీని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేశ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత కార్మిక సంఘాల పిలుపు మేరకు చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాలు ప్రచారం నిర్వహించాలన్నారు. 2014లో బీజేపీ ప్రకటించిన అభివృద్ధి నినాదం కారుమబ్బుల్లా కరిగిపోయిందని ఎద్దేవా చేశారు. జిల్లా కార్యదర్శి రాజేందర్, నాయకులు కృష్ణమచారి తదితరులు పాల్గొన్నా రు.

పిచ్చికుక్క దాడిలో మహిళకు గాయాలు



చికిత్స పొందుతున్న మంగ

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలంలోని అరెగూడ గ్రామానికి చెందిన రోహిణి మంగ అనే మహిళపై ఆదివారం పిచ్చికుక్క దాడి చేసి గాయపర్చింది. స్థానికులు కేకలు వేయడంతో కుక్క అక్కడి నుంచి పారిపోయింది. బాధితురాలి కాలికి తీవ్ర గాయాలు కావడంతో కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

అంబేద్కర్ జయంతి నిర్వహణకు సన్నాహాలు



మాట్లాడుతున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఈ నెల 27న మధ్యాహ్నం 2 గంటలకు అన్ని కుల సంఘాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు భారత్ బచావో జిల్లా నాయకులు సోయం చిన్నన్న తెలిపారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవ నిర్వహణ కమిటీ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. సమావేశానికి అన్ని కులసంఘాలు, ప్రజా సంఘాల నాయకులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు కొండా రాంప్రసాద్, జయదేవ్ అబ్రహం, అల్లి రాజయ్య, ఆత్రం సాయి, బి.నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులు లేవు.. ఇండ్లు లేవు

- విక్రమార్కకు సమస్యలు ఏకరువు పెట్టిన రైతులు
- కౌలు రైతులకూ 'రైతుబంధు' ఇవ్వాలని వేడుకోలు
- 11వ రోజుకు చేరిన భట్టి పాదయాత్ర

ఆసిఫాబాద్: ఉండేందుకు ఇండ్లు, కనీసం రేషన్ కార్డులు కూడా లేవని ఆసిఫాబాద్ మండలం మోతుగూడకు చెందిన పలువురు రైతులు, గ్రామస్తులు సీఎల్పీ నేత భట్టి విక్రమార్కకు సమస్యలు ఏకరువు పెట్టారు. హాథ్ సే హాథ్ జోడోయాత్రలో భాగంగా చేపట్టిన పాదయాత్ర ఆదివారం 11వ రోజుకు చేరుకుంది. ఆసిఫాబాద్ మండలం మోతుగూడలో గ్రామస్తులు భట్టికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ గోడు వెల్లబోసుకున్నారు. అనంతరం భట్టి విక్రమార్క స్థానికులను ఉద్దేశించి మాట్లాడారు. త్వరలోనే కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఏర్పడుతుందని, అప్పుడు అందరికీ ఇళ్లు వస్తాయని తెలిపారు. స్థలం ఉన్న వారికి ఇల్లు కట్టుకునేందుకు రూ.5లక్షలు, అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వడంతోపాటు కౌలు రైతులకు ప్రత్యేక పథకం తీసుకువస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర సంపాదనను దోచుకుంటుందని ఆరోపించారు. రుణమాఫీ చేయకుండా రైతులను అప్పుల ఊబిలోకి నెట్టిందని విమర్శించారు. డబుల్ బెడ్రూం ఇళ్లు ఇచ్చుడు దేవుడెరుగు కానీ ఉన్న ఇందిరమ్మ ఇళ్లను మాయం చేశారన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీలో ప్రభుత్వ పెద్దలకు శిక్ష పడే వరకు కాంగ్రెస్ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అర్హులకు రేషన్‌కార్డులిచ్చి, అమ్మహస్తం పథకం ద్వారా 9 సరుకులు పంపిణీ చేస్తామని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్లు నిర్మిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏడో తరగతి చదువుతున్న చైతన్య ఆయన వద్దకు వచ్చి పాఠశాలలో టాయిలెట్లు లేక ఇబ్బంది పడుతున్నామని చెప్పడంతో భట్టి ఆవేదన చెందారు. చైతన్య మాదిరి రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న టాయిలెట్ల సమస్యపై ప్రభుత్వానికి లేఖ రాస్తానని హామీ ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం నిధులను దళిత, గిరిజనుల అభివృద్ధి వెచ్చిస్తామన్నారు.



మోతుగూడలో ప్రజలకు అభివాదం చేస్తున్న భట్టి విక్రమార్క

బూర్గుడ వద్ద సంకల్ప దీక్ష

అంతకు ముందు రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ ఏఐసీసీ ఆదేశాల మేరకు ఆసిఫాబాద్ మండలం బూర్గుడ వద్ద పార్టీ శ్రేణులతో కలిసి సంకల్ప దీక్ష చేపట్టారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జవహర్ లాల్ నెహ్రూ ఆలోచనతోనే దేశం పురోగమించిందని స్పష్టం చేశారు. భూసంస్కరణ ద్వారా భూమి లేని నిరుపేదలకు ఉత్పత్తి రంగంపై హక్కు కల్పించిన ఇందిరా గాంధీతోనే ఉత్పత్తి రంగం అభివృద్ధి చెందిందని తెలిపారు. అలాగే ప్రపంచ దేశాలతో పోటీ పడాలని 21వ శతాబ్దంలో దేశంలో కంప్యూటర్ రెవల్యూషన్ తీసుకొచ్చి సాంకేతిక విప్లవానికి రాజీవ్‌గాంధీ పునాదులు వేశారన్నారు. ఇంతటి ఘన చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ వారసుడు రాహుల్ గాంధీపై మోదీ ప్రభుత్వం అనర్హత వేటు వేసి భారత ప్రజాస్వామ్యం తలదించుకునేలా చేసిందని విమర్శించారు. రాహుల్ గాంధీని కాపాడుకోవడమే ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడమని, ఇందుకోసం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లౌకిక వాదులు, ప్రజాస్వామ్య వాదులు, రాజ్యాంగ ప్రేమికులు దృఢమైన దీక్షతో పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు కొక్కిరాల విశ్వప్రసాద రావు, మంచిర్యాల డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, పీసీసీ జనరల్ సెక్రెటరీ సరస్వతి, పీసీసీ సభ్యులు రాథోడ్ గణేశ్, నాయకులు చిలుముల శంకర్, రావి శ్రీనివాస్, కృష్ణారెడ్డి, చరణ్, వసంత్‌రావు, గుండ శ్యాం తదితరులు పాల్గొన్నారు.

'భట్టి అన్న దారిలో..' పాట ఆవిష్కరణ



పాట కరపత్రాలు ఆవిష్కరిస్తున్న భట్టి విక్రమార్క, నాయకులు

ఆసిఫాబాద్: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్రకు కలసి రండి.. కదలి రండి అంటూ పీసీసీ సభ్యులు కోరెల్ల కృష్ణారెడ్డి రచించిన 'భట్టి అన్న దారిలో.. భట్టి అన్న దారిలో.. నీ దారి నా దారి కాంగ్రెస్ దారిలో..' అనే పాటను ఆసిఫాబాద్ మండలంలోని బూర్గుడ పాదయాత్ర క్యాంపులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత కృష్ణారెడ్డిని భట్టి విక్రమార్క శాలువతో సన్మానించి అభినందించారు. కాంగ్రెస్ పార్టీని కార్యకర్తల అభిమానమే బతికిస్తుందని భట్టి విక్రమార్క అన్నారు.

ఆగని అక్రమ దందా!

పశువుల అక్రమ దందాకు అడ్డుకట్ట పడటం లేదు. నిబంధనలకు విరుద్ధంగా మూగజీవాలను వాహనాల్లో కుక్కి ప్రాణాలు తీస్తున్నారు. అధికారుల తనిఖీలు లేకపోవడంతో దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు, పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో మూగజీవుల మృత్యుఘోష కొనసాగుతూనే ఉంది.

- జిల్లా మీదుగా మూగజీవాల అక్రమ రవాణా
- పశువుల మాఫియాకు రాజకీయ అండ!
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- చెక్‌పోస్టులు ఎత్తివేయడంతో రెచ్చిపోతున్న దళారులు
- తాజాగా కాగజ్‌నగర్ మండలంలో పశువులు తరలిస్తున్న వాహనం పట్టివేత

ఆసిఫాబాద్: సాధారణంగా పశువులను ఇతర ప్రాంతాలకు తరలించాలంటే సంతలో కొనుగోలు చేసిన ధ్రువపత్రం ఉండాలి. అలాగే పశు వైద్యుడు ఇచ్చిన ధ్రువీకరణ పత్రంతోపాటు ఒక్కో వాహనంలో కేవలం ఆరు మాత్రమే పశువులు తీసుకెళ్లాలని కఠిన నిబంధనలు ఉంటాయి. కానీ జిల్లలో ఎక్కడా నిబంధనలు అమలు కావడం లేదు. ఆర్టీఏ అధికారులు, పోలీసుల తీరుతో ప్రధాన రహదారి పక్కనే పోలీస్ స్టేషన్‌లు ఉన్నా అక్రమ రవాణా విచ్చలవిడిగా కొనసాగుతోంది. ఫలితంగా మూగజీవుల మరణ మృదంగం కొనసాగుతూనే ఉంది.

గుట్టుచప్పుడు కాకుండా..

గతంలో వాంకిడి మండలం గణేశ్‌పూర్, జైనూర్ కేంద్రంగా అక్రమ పశువుల రవాణా కొనసాగేది. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ నుంచి ఆసిఫాబాద్ మీదుగా హైదరాబాద్‌లోని అల్‌కబీర్‌కు గుట్టుచప్పుడు కాకుండా పశువులను తరలిస్తున్నారు. ప్రతి వారంలో వాన్లు, ఐచర్ వ్యాన్లలో పరిమితికి మించి నిబంధనలకు విరుద్ధంగా పశువుల అక్రమ రవాణా కొనసాగుతోంది. ఈ దందాకు పైస్థాయిలో అండదండలు ఉండడంతో పోలీసులు నిలువరించలేని పరిస్థితి నెలకొంది. తాజాగా ఈ నెల 23న కాగజ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మహారాష్ట్ర నుంచి రూ.3 లక్షల విలువ చేసే 20 పశువులను అక్రమంగా తరలిస్తున్న ఐచర్ వ్యాన్‌ను టాస్క్‌ఫోర్స్ సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. కాగజ్‌నగర్‌కు చెందిన యెనాస్, మహారాష్ట్రకు చెందిన అస్లాంలను అరెస్టు చేశారు. అక్రమ పశువుల రవాణా దందా నిత్యం కొనసాగుతున్నా అడ్డుకునే వారు కరువయ్యారు. దీంతో ఈ దందా మూడు పువ్వులు.. ఆరు కాయలు అన్న తీరుగా కొనసాగుతోంది. ఈ చీకటి దందా వెనుక తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ముఠా హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రతినెలా రూ.కోట్లలో పశువులు తరలిపోతున్నట్లు సమాచారం.

వ్యవసాయం పేరుతో కొనుగోళ్లు..

వాంకిడి మండలం గణేశ్‌పూర్, జైనూర్‌తో పాటు కాగజ్‌నగర్ డివిజన్‌లోని పలు గ్రామాలు, సరిహద్దు గ్రామాల్లో వారం వారం జరిగే సంతల్లో వ్యవసాయం పేరుతో పశువులను కొనుగోలు చేస్తున్నారు. వాటిని నిబంధనలకు విరుద్ధంగా ట్రాలీలు, ఐచర్ వ్యాన్లలో హైదరాబాద్ కబేళాలకు రవాణా చేస్తున్నారు. పగటిపూట పశువుల కొనుగోలు చేయడం, రాత్రికి రాత్రే వాటిని ప్రత్యేక వాహనాలు, కంటైనర్లలో 40 నుంచి 50 వరకు కుక్కుతున్నారు. వాహనాల్లో తిండి లేక, ఊపిరి ఆడక కొన్ని పశువులు మార్గమధ్యలోనే మృత్యువాత పడుతున్నాయి. వాంకిడి నుంచి అర్ధరాత్రి దాటిన తర్వాత మంచిర్యాల మీదుగా హైదరాబాద్‌కు దర్జాగా తరలిస్తున్నారు. సంబంధిత అధికారులు 'మామూలు'గా వ్యవహరించడంతో ఈ దందాకు నేటికీ అడ్డుకట్ట పడడం లేదు. అడపాదడపా పోలీసులు వాహనాలను పట్టుకుంటున్నా అసలు సూత్రదారులు మాత్రం చిక్కడం లేదు. గతంలో వాంకిడి మండలం బుజల్‌ఘాట్ వాగు వద్ద, సిర్పూర్(టి) మండల కేంద్రం వెంకట్రావ్‌పేట్ వద్ద పోలీసులు చెక్‌పోస్టు ఏర్పాటు చేసినప్పటికీ ఆరు మాసాల నెలల క్రితమే వాటిని తొలగించారు. ఇది దళారులకు వరంగా మారింది.



కాగజ్‌నగర్‌లో పట్టుకున్న వాహనంలో పశువులు

కఠిన నిబంధనలు

పశువులను కబేళాలకు తరలించాలంటే ప్రభుత్వం నిర్దేశించిన కఠిన నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. మూగజీవాలను తరలించే వాహనాల్లో గాలి, వెలుతురు సక్రమంగా ఉండాలి. నీరు, దానా, ఆహారం అందించాలి. వాహనం పైకప్పు ఉండాలి. పశువులకు మధ్య కనీసం రెండు చదరపు మీటర్ల ఎడం ఉండాలి. గర్భంతో ఉన్న ఆవులు, మూడేళ్ల లోపు దూడలు తరలించడం పూర్తిగా నిషేధం. ఎడ్లు వ్యవసాయానికి పనికిరావని పశువైద్యాధికారి ధ్రువీకరించిన పత్రాలు ఉండాలి. జీవాలను వాహనం నుంచి దింపేటప్పుడు గాయాలు కాకుండా దింపాలి. ఇప్పటికైనా అధికారులు నిఘా ఏర్పాటు చేసిన మూగజీవాల అక్రమ రవాణాను అడ్డుకోవాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

ఈదురుగాలులు.. వడగళ్లు

- ఆదివారం సాయంత్రం పలుచోట్ల వర్షం
- జిల్లాలో చల్లబడిన వాతావరణం
- విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలకు అవస్థలు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో ఆదివారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. మధ్యాహ్నం వరకు ఉక్కపోత, ఎండతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు వాతావరణ మార్పుతో కాస్త ఉపశమనం పొందారు. అయితే బలమైన ఈదురు గాలులకు పట్టణంలోని తారకరామానగర్ కాలనీలో గల మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ ఐరన్ మెట్లు ఒక్కసారిగా కిందపడిపోయాయి. బషీర్ ఖాన్‌కు చెందిన ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. అదే కాలనీలో గాలులకు విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని, అధికారులకు సమాచారం అందించినా సకాలంలో పునరుద్ధరణ చేపట్టలేదని స్థానికులు ఆరోపించారు.



టీఆర్‌నగర్‌లోని ఓ ఇంటి వద్ద పడిపోయిన భగీరథ ట్యాంకు ఐరన్ మెట్లు



కాగజ్‌నగర్‌లో వడగళ్ల వాన

కాగజ్‌నగర్‌లో వడగళ్లు..

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారి భారీ వర్షంతోపాటు వడగళ్లు పడ్డాయి. మరో వైపు పట్టణంలో విద్యుత్ అంతరాయంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. పలుచోట్ల డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో రోడ్లపై మురుగునీరు ప్రవహించింది.

కాగజ్‌నగర్‌రూరల్: వర్షానికి ఆసిఫాబాద్ మండలంలోని మెసెం, అరెగూడ, ఈసగాం, నజ్రూల్‌నగర్ గ్రామాల్లో మామిడి తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పెంచికల్‌పేట్ వైపునకు వెళ్లే 33 కేవీ విద్యుత్ లైన్‌లో సాంకేతిక సమస్య ఏర్పడటంతో సరఫరా నిలిచిపోయింది.

కౌటాల: మండలంలో మధ్యాహ్నం ఈదురుగాలులతో కురిసిన వర్షానికి మొక్కజొన్న, మిర్చి పంటలు దెబ్బతిన్నాయి. వీరవల్లి గ్రామానికి చెందిన నక్కుతె ప్రకాశ్ ఇల్లు వర్షానికి కూలిపోయింది. పంటలను రక్షించుకునేందుకు రైతులు అవస్థలు పడ్డారు.

క్లుప్తంగా

అడవిపంది దాడిలో ఒకరికి గాయాలు

జన్నారం: మండలంలోని రోటిగూడ గ్రామానికి చెందిన సిలివేరు రవి అడవిపంది దాడిలో గాయపడ్డాడు. బాధితుడు తెలిపిన వివరాలు..ఆదివారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లాను. అడవిపంది దాడిలో తీవ్రంగా గాయపడిన రవిని స్థానికులు ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు.

గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకుల అరెస్ట్

కాగజ్‌నగర్‌టౌన్: గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను శనివారం రాత్రి పట్టణ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఎస్సై డి.చంద్రశేఖర్ కథనం ప్రకారం.. పక్కా సమాచారంతో పట్టణంలోని నౌగాంబస్తీలో ఓ నిరుపయోగంగా ఉన్న ఇంటిపై దాడి చేసి, గంజాయి సేవిస్తున్న సాయి, జమీర్, శివ పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి 96 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను విచారించగా, ఈజ్‌గాంకు చెందిన రాహుల్ మండల్ నుంచి గంజాయిని కొనుగోలు చేసినట్లు వెల్లడించారని ఎస్సై పేర్కొన్నారు. రాహుల్ మండల్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బైక్, బొలెరో ఢీ

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాకేంద్రంలోని ఆదర్శ పాఠశాల సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం బైక్ బొలెరో వాహనం ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబీకులు తెలిపిన వివరాలు.. చిలాటిగుడా గ్రామం నుంచి అశోక్, విక్రమ్‌లు జిల్లా కేంద్రానికి పని నిమిత్తం బైక్‌పై వస్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొట్టింది. బైక్‌పై ఉన్న ఇద్దరు కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచనలతో మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించినట్లు తెలిపారు.

మట్కా ఆడుతున్న ఒకరి అరెస్ట్

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని చింతగూడ కోయవాగులో ఆన్‌లైన్‌లో మట్కా ఆడుతున్న ఒకరిని అరెస్ట్ చేసినట్లు కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై సోనియా తెలిపారు. అంబేద్కర్ చౌరస్తాలో ఆన్‌లైన్ మట్కా ఆడుతుండగా ఆదివారం దాడి చేసి మైదం కాలేశ్‌ను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో రెండు సెల్‌ఫోన్లు, ఒక ప్రింటర్‌తోపాటు రూ.500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

రెబ్బెన: మండలంలోని రోళ్లపాడుకు చెందిన రిబ్బెన లావణ్య(23) అనే వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై భూమేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. లావణ్యకు కైరిగూడకు చెందిన కుమ్మరి బాపురావుతో గత సంవత్సరంన్నర క్రితం వివాహం జరిగింది. అయితే అప్పటికే వేరే అమ్మాయితో బాపురావుకు ప్రేమ వ్యవహారం ఉంది. పెళ్లయిన 15 రోజులకే అమ్మాయితో బాపురావు వెళ్లిపోయాడు. దాంతో లావణ్య రోళ్లపాడులోని తన తల్లిగారింటి వద్ద ఉంటోంది. గత కొన్నినెలలుగా పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు పెట్టినా పరిష్కారం కాలేదు. దీంతో తీవ్ర మనస్తాపం చెంది జీవితంపై విరక్తితో లావణ్య శనివారం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబీకులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలి అన్న రమేశ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కేంద్రీయలో ప్రవేశాలు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, అనుబంధ సంస్థల ఉద్యోగుల పిల్లలకు అవకాశం
- ఉమ్మడి జిల్లాలో ఆదిలాబాద్, మంచిర్యాలలో విద్యాలయాలు
- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ



ఆదిలాబాద్ కేంద్రీయ విద్యాలయం

బజార్‌హత్నూర్: కేంద్ర ప్రభుత్వం, కేంద్ర మానవ వనరులశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేంద్రీయ విద్యాలయాల్లో 2023–24 విద్యాసంవత్సరానికి 1వ తరగతిలో ప్రవేశాలు మార్చి 27 ఉదయం 10 గంటల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ప్రారంభమవుతాయి. చివరితేది ఏప్రిల్ 17 సాయంత్రం 7గంటల వరకు అవకాశం కల్పించారు. ఈ విద్యాలయాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు ప్రాధాన్యత ఉంటుంది. అడ్మిషన్ పొందే విద్యార్థి 2023 మార్చి 31 నాటికి 6 ఏళ్ల వయస్సు దాటి ఉండాలి. వికలాంగులకు మాత్రం రెండేళ్లు వరకు వయస్సు సడలింపు కల్పించారు.

ప్రాధాన్యత క్రమం..
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు , మాజీ సైనిక ఉద్యోగుల పిల్లలకు మొదటి ప్రాధాన్యత ఉంటుంది.
- కేంద్ర ప్రభుత్వ రంగ అనుబంధ సంస్థ (బీఎస్ఎన్ఎల్, ఎల్ఐసీ, బ్యాంకు, పోస్టల్ తదితర) ఉద్యోగుల పిల్లలకు రెండవ ప్రాధాన్యత.
- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు మూడవ ప్రాధాన్యత ఉంటుంది.
- రాష్ట్ర ప్రభుత్వ అనుబంధ సంస్థలు (ఆర్టీసీ, ఎన్పీడీసీఎల్ తదితర) ఉద్యోగుల పిల్లలకు నాల్గో ప్రాధాన్యత.
- మిగిలిన వారికి ఐదో ప్రాధాన్యతగా ప్రవేశాలు కల్పిస్తారు.

- విద్యాలయ చైర్మన్(కలెక్టర్) రెండు సీట్లను ప్రతిపాదించవచ్చు.
- వారు ప్రతిపాదించే సీట్లు కేవీఎస్ నిబంధనలకు అనుగుణంగా ఉండాలి.

మొదటి నోటిఫికేషన్
- మార్చి 27 ఉదయం 10గంటల నుంచి ఏప్రిల్ 17 సాయంత్రం 7గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- మొదటి మెరిట్ లిస్టు : ఏప్రిల్ 20 (ఏప్రిల్ 21 నుంచి 1వ తరగతి ప్రవేశాలు)
- రెండవ మెరిట్ లిస్టు : ఏప్రిల్ 28న (మొదటి లిస్టులో మిగిలిన సీట్లు)
- మూడవ మెరిట్ లిస్టు : మే 4న (రెండవ లిస్టులో మిగిలిన సీట్లు)

ఎంపిక విధానం
- ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి కేంద్రీయ విద్యాలయం సంఘటన్ (కేవీఎస్) నుంచి 80 మంది విద్యార్థుల ఎంపిక జాబితాను నేరుగా విద్యాలయానికి పంపుతారు. జాబితాను కేవీ అధికారులు సంబంధిత వెబ్‌సైట్‌లో ప్రదర్శిస్తారు.
- లిస్టులో ఉన్నవారు మాత్రమే తమ ఒరిజనల్ సర్టిఫికెట్‌లతో కేవీలో సంప్రదించి ప్రవేశాలు పొందాల్సి ఉంటుంది. ప్రవేశాలు పొందుటకు నోటిఫికేషన్ రోజు నుంచి 30రోజుల గడువు ఇస్తారు.
- ఎలాంటి డ్రా అయిన చైర్మన్ సూచించిన అధికారితో పాటుగా వీఎంసీ మెంబర్, ప్రిన్సిపాల్ నూతనంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు (వీరిలో ఒకరు విద్యా హక్కు చట్టం ప్రకారం సీటు పొందేవారు) ఒక విద్యార్థి సమక్షంలో ఎంపిక నిర్వహిస్తారు.
- కేంద్రీయ విద్యాలయం నిబంధనల మేరకు ఎస్సీలకు 15శాతం ఎస్టీలకు 7.5 శాతం, ఆర్థికంగా బలహీనంగా (ఈడబ్ల్యూఎస్) ఉన్న కుటుంబాల పిల్లలకు 27శాతం సీట్లు, వికలాంగులకు 3శాతం సీట్లు కేటాయించారు.

ఫీజు వివరాలు...
- అడ్మిషన్ పొందే విద్యార్థులు రూ.25 ప్రవేశ రుసుం చెల్లించాలి.
- ఒకటో తరగతి నుంచి 12వ తరగతి విద్యార్థి వరకు నెలకు రూ.500 చెల్లించాలి.
- 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు కంప్యూటర్ బోధన కోసం అదనంగా నెలకు రూ.100 చెల్లించాలి.
- 9, 10వ తరగతి విద్యార్థులకు ట్యూషన్ ఫీజు కింద అదనంగా నెలకు రూ.200 చెల్లించాలి.
- 11, 12వ తరగతి విద్యార్థులకు ట్యూషన్ ఫీజు కింద అదనంగా నెలకు రూ.400 చెల్లించాలి.

దరఖాస్తు చేసుకునే విధానం..

kvsonlineadmission.kvs.gov.in లేదా kvssangathan.nic.in ద్వారా లాగిన్ కావాలి.
- కేంద్రీయ విద్యాలయంలో సాధారణంగా ప్రతి సంవత్సరం ఒకటో తరగతికి మార్చి నెలలో అడ్మిషన్‌లు ఇస్తారు.
- రెండు సెక్షన్‌లలో 40 మంది విద్యార్థుల చొప్పున 80 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తారు.
- రిజిస్ట్రేషన్ కోసం పుట్టిన తేది, కులం నివాసం, వృత్తి ధ్రువీకరణ పత్రాల సమాచారాన్ని తప్పక పొందు పరచాలి.
- ఈడబ్ల్యూఎస్(ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు) బీపీఎల్ కింద దరఖాస్తు చేసుకునేవారు ధ్రువీకరణ పత్రం సంఖ్యను నమోదు చేయాలి. పీహెచ్‌సీ వారు వికలాంగుల ధ్రువీకరణ పత్రాలను పొందుపరచాలి.
- బీసీ కులస్తులైతే ఓబీసీ సర్టిఫికెట్ తప్పక కలిగి ఉండాలి.
- ఏక సంతానం(కూతురు) గల వారు నేరుగా విద్యాలయంలోనే దరఖాస్తు చేసుకొనే వీలు కల్పించారు. మరో సంతానం లేనట్లుగా నోటరీ ద్వారా జారీ చేసిన అఫిడవిట్‌ను అందజేయాలి. ఒకవేళ ఎక్కువ దరఖాస్తులు వస్తే డ్రా పద్ధతిలో ఎంపిక చేస్తారు.
- 2 నుంచి 10వ తరగతులల్లో (11వ తరగతిలో కూడా) ఖాళీ సీట్లకు ఏప్రిల్ 3 నుంచి ఏప్రిల్ 12వరకు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

మోదీ సర్కారును గద్దె దించడమే లక్ష్యం


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న సాంబశివరావు, తదితరులు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు


మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

నస్పూర్(మంచిర్యాల): కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తూ, దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దారాదత్తం చేసేందుకు యత్నిస్తున్న మోదీ సర్కారును గద్దె దించడమే లక్ష్యంగా బీఆర్ఎస్‌తో పాటు కలిసి వచ్చే పార్టీలతో పని చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో ఆదివారం నిర్వహించిన పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీని ప్రశ్నించే వారిపైకి ఈడీ, సీబీఐలను ఉసిగొల్పి, భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. దొంగల ఇంటి పేరులో మోదీ ఉందని రాహుల్‌గాంధీ విమర్శించారనే నెపంతో ఆయన లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. రాష్ట్రంలో టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీల విషయంలో సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బీజేపీ హఠావో.. దేశ్‌కీ బచావో నినాదంతో ఏప్రిల్ 14 నుంచి మే 14 వరకు 'ఇంటింటికి సీపీఐ' కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు. మే14న లక్ష మందితో కొత్తగూడెంలో బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు.

'గుర్తింపు' ఎన్నికల్లో ఏఐటీయూసీని గెలిపించాలి

ప్రభుత్వరంగ సంస్థల మాదిరిగా సింగరేణిని ప్రైవేటుపరం చేసేందుకు కేంద్రం యత్నిస్తోందని సాంబశివరావు ఆరోపించారు. సింగరేణిని నిలబెట్టుకోవాలంటే వచ్చే గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీని గెలిపించాలని కోరారు. ఇందారం క్రాస్ రోడ్డు నుంచి సీసీసీ న్యూ కమ్యునిటీ హాల్ వరకు బైక్ ర్యాలీ ద్వారా బయల్దేరి శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద సింగరేణి కార్మికుని విగ్రహానికి, సీసీసీ కార్నర్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సింగరేణిలో కార్మికుల కోసం అనేక హక్కులు సాధించిపెట్టిన ఘనత సీపీఐకే దక్కిందన్నారు. సింగరేణిని ప్రైవేటు పరం చేసే అధికారం కాని ఆలోచన కాని లేదని ప్రధాని మోదీ గతంలో అన్నారని గుర్తు చేశారు. సింగరేణికి చెందిన నాలుగు బ్లాకులను వేలానికి ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. రోజుకో పార్టీ మారే స్థానిక ఎమ్మెల్యే కమ్యునిస్టుల పని అయిపోయిందని అవాకులు చెవాకులు మాట్లాడుతున్నారని విమర్శించారు. తమది సిద్ధాంతాలను నమ్ముకున్న పార్టీ అని పదవుల కోసం వెంపర్లు ఆడే పార్టీ కాదన్నారు.

మతోన్మాద శక్తుల చేతుల్లో..

దేశం కొంతమంది మతోన్మాద శక్తుల చేతుల్లోకి వెళ్లిపోయిందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ఆరోపించారు. బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలతో వివిధ రాష్ట్రాల్లో మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి బాధ్యతగా ప్రధాని మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య, జిల్లా సమితి సభ్యులు చంద్రశేఖర్, లింగం రవి, మండల కార్యదర్శి మల్లయ్య పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేణ శంకర్, మంచిర్యాల, నిర్మల్, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాల కార్యదర్శులు రామడుగు లక్ష్మణ్, విలాస్, బద్రి సత్యనారాయణ, ప్రభాకర్ పాల్గొన్నారు.

పెన్షన్ కోసం మూగవేదన


తల్లి లక్ష్మితో సాగరవీణ

తాండూర్: వికలాంగుల పెన్షన్ అర్ధాంతరంగా నిలిచిపోవడంతో మూగ, చెవిటితనంతో బాధపడుతున్న దివ్యాంగురాలు తీవ్ర వేదనకు గురవుతోంది. ఆరేళ్ల క్రితం తండ్రిని కోల్పోయి, కూలీ పనులకు వెళ్లే తల్లి ఆధారంగా ఆ బాలిక చదువు కొనసాగిస్తోంది. మండలంలోని అచ్చులాపూర్‌కు చెందిన బోగారపు లక్ష్మి, రాజం దంపతులకు ఇద్దరు ఆడ పిల్లలు. వీరిలో పెద్ద కుమార్తె శరణ్యకు వివాహమైంది. చిన్న కుమార్తె సాగరవీణ స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుకుంటోంది. పుట్టుకతోనే ఆమెకు అవిటితనం సంక్రమించింది. 2014లో మంజూరైన పెన్షన్ 2020 వరకు ఆరేళ్ల పాటు వచ్చింది. అదేఏటా సదరం రెన్యువల్‌కు వెళ్లగా ఆమెను పరీక్షించిన డాక్టర్.. అనర్హురాలిగా సర్టిఫికేట్ జారీ చేశాడు. దీంతో పెన్షన్ అర్ధాంతరంగా నిలిచిపోయింది. సదరం ఆన్‌లైన్‌లో డేటా రిమూవ్ చేయకపోవడంతో మరోసారి దరఖాస్తు చేసుకోవడానికి వీలు లేకుండా పోయింది. మూడేళ్ల నుంచి పెన్షన్ రాక అష్టకష్టాలు పడుతోంది. పెన్షన్ పునఃరుద్ధరించాలని సాగరవీణ అధికారులను వేడుకున్నా ఫలితం లేకపోయింది. కలెక్టర్‌కు, డీఆర్‌డీఏ కార్యాలయానికి వెళ్లి బాధను చెప్పుకున్నా కనికరించకుండా తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. కూలీ పనులకు వెళ్తే కాని పొట్టగడవని స్థితిలో ఉండటంతో పెన్షన్‌ను పునఃరుద్ధరించి ఆదుకోవాలని బాధితురాలు తల్లి వేడుకుంటోంది.

పరిహారం తేల్చండి మహాప్రభో..

- వరంగల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణంతో కోల్పోనున్న రైతుల భూములు
- ప్రజాభిప్రాయ సేకరణలో ఎటూ తేలని పరిహారం
- ఎకరాకు రూ.కోటి చెల్లించాలని డిమాండ్



వేలాల సమీపంగా నూతన ప్రతిపాదిత వరంగల్ హైవే రోడ్డు

జైపూర్: అవి పచ్చని పంట పొలాలు.. లక్షల విలువ చేసే భూములు వరంగల్–విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు కింద రైతులు నష్టపోతున్నారు. పరిహారం ఎంత ఇస్తారో..మిగులు భూములు తీసుకుంటారో లేదోనని వరంగల్ హైవే రోడ్డు నిర్మాణంలో భూములు నష్టపోతున్న రైతుల ఆవేదన ఇది. రోడ్డు నిర్మాణం కాకముందే ఒక్క పక్క రియల్ ఎస్టేట్ వ్యాపారులు లక్షలు, కోట్లరూపాయలతో భూములు కొనుగోలు చేస్తూ వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు. అంతటి విలువైన భూములు కోల్పోతున్న రైతులు తమకు అదేస్థాయిలో నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. సరిగ్గా ఏడాది క్రితం షెట్‌పల్లి కేంద్రంగా ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని విన్నవించారు. ఎంత ఇస్తారో అధికార యంత్రాంగం తేల్చకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. కాగా, వరంగల్ హైవే రోడ్డు నిర్మాణంలో భూమి నష్టపోయిన వరంగల్ ప్రాంతానికి చెందిన ఓ రైతు పరిహారం విషయంపై ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అందరినీ ఆవేదనకు గురిచేసింది.

మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం 14 గ్రామాల మీదుగా నూతనంగా నిర్మించనున్న వరంగల్ హైవే రోడ్డు నిర్మాణం జరుగనుంది. నర్వ శివారులో గల రసూల్‌పల్లి పక్క నుంచి మంచిర్యాల–చెన్నూర్ 63వ నెంబర్ జాతీయ రహదారిపై నుంచి ఇందారం, టేకుమట్ల శివారుల నుంచి ఎల్కంటి, షెట్‌పల్లి మీదుగా నర్సింగాపూర్, బెజ్జాల, కుందారం, రొమ్మిపూర్, కిష్టాపూర్, వేలాల, గోపాల్‌పూర్ గ్రామం మీదుగా గోదావరి నదిపై నుంచి పెద్దపల్లి జిల్లా మంథని మీదుగా వరంగల్ హైవే రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. జిల్లా వ్యాప్తంగా 25 కి.మీ రోడ్డు నిర్మించనుండగా సుమారు 300 ఎకరాల భూమిని రైతులు కోల్పోనున్నారు. ఎల్కంటి, కుందారంలో శ్మశానవాటికలు రోడ్డు నిర్మాణంలో పోతున్నాయి. ప్రస్తుత మార్కెట్ విలువకు అనుగుణంగా ఎకరాకు కోటి చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఏడాది కిందట 3ఏ జీవో విడుదల చేయగా మధ్యలో 3డీజీ వచ్చిన ప్రభుత్వం ఇప్పుడు 3జీ జీవో జారీ చేయడంతో భూములు నష్టపోతున్న రైతులు పట్టదారుల భూ ఆధారాలు, వివరాలు, అభ్యంతరాలను ఆర్డీవో స్థాయిలో స్వీకరించారు. అనంతరం అవార్డు ఎంక్వైయిరీ చేపట్టి వారితో మరోమారు సమావేశమై గ్రామాలవారీగా పరిహారం చెల్లింపు, ధర నిర్ణయాలు చేపట్టనున్నారు.

మార్కెట్ విలువ ప్రకారం ధర చెల్లించాలి



తాతలు, తండ్రుల కాలం నుంచి అవే భూములపై ఆధారపడి జీవిస్తున్నాం. రోడ్డు నిర్మాణంతో భూములు కోల్పోతున్నాం. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం ధర చెల్లించాలి. ఎకరాకు కోటి వరకు చెల్లిస్తే భూములిస్తాం. అసలు ఎంత ఇస్తారో చెప్పడం లేదు. నష్టపరిహారాన్ని ముందే తేల్చాలి.

– కె.రామ్‌రెడ్డి, కిష్టాపూర్, రైతు

నీటి ట్యాంకర్ ట్రాక్టర్ బోల్తా


బోల్తాపడిన ట్రాక్టర్


గాయపడిన డ్రైవర్ శ్రీశైలం

కాసిపేట: మండలంలోని కాసిపేటగని సమీపంలో నీటి ట్యాంకర్ ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో భీమినికి చెందిన డ్రైవర్ శ్రీశైలంకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. ఆదివారం సాయంత్రం 7 గంటల సమయంలో నీటి ట్యాంకర్ ట్రాక్టర్ దేవాపూర్ వైపునకు వెళ్తుండగా అదుపుతప్పి బోల్తాపడింది. తీవ్రంగా గాయపడ్డ డ్రైవర్‌ను స్థానికులు 108లో ఆస్పత్రికి తరలించారు.

ఎస్టీపీపీ క్వార్టర్స్‌లో దొంగతనం

జైపూర్: ఎస్టీపీపీలోని ఎంబీ–5 బ్లాక్‌లో గల క్వార్టర్స్‌లో దొంగతనం జరిగింది. తోటి ఉద్యోగులు, ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాలు.. మహారాష్ట్రకు చెందిన ఎన్.నరేశ్ ఎస్టీపీపీ విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణ బాధ్యతలు చేపడుతున్న పవర్ మేక్ కంపెనీలో ఎస్ఆర్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఎంబీ–5 బ్లాక్ క్వార్టర్స్ నెంబర్–10లో నరేశ్ కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. ఈనెల 23న క్వార్టర్‌కు తాళం వేసి కుటుంబీకులతో కలిసి మహారాష్ట్రకు వెళ్లారు. కాగా, తాళం పగిలి ఉండటాన్ని గమనించిన స్థానికులు నరేశ్‌కు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చూడగా రూ.40వేల నగదు, 15 తులాల వెండి పట్టీలను దొంగలు ఎత్తుకెళ్లారని గుర్తించారు. బాధితుడు ఆదివారం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. కాగా, సీఐఎస్ఎఫ్ భద్రతల నడుమ ఎప్పుడూ నిరంతరం నిఘాతో ఉండే పవర్ ప్లాంట్ క్వార్టర్స్‌లో దొంగతనం చోటుచేసుకోడం స్థానికంగా కలకలం రేపింది.

భర్తను రాడ్‌తో కొట్టి హత్య

కాసిపేట: భార్య రాడ్‌తో కొట్టి భర్తను హత్య చేసిన ఘటన మండలంలోని తంగళ్లపల్లిలో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాలు ప్రకారం.. తంగళ్లపల్లికి చెందిన దుంపటి మహేశ్(42) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తాగుడుకు బానిసై భార్య లావణ్యతో తరచూ గొడవ పడేవారు. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. లావణ్య రాడ్‌తో మహేశ్ తలపై కొట్టడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు. మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి, దేవాపూర్ ఎస్సై విజయేందర్‌లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలి


మాట్లాడుతున్న సీతారామయ్య

మందమర్రిరూరల్: సింగరేణిలో షెడ్యూల్ ప్రకారం గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని ఏఐటీయూసీ జనరల్ సెక్రెటరీ వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. మందమర్రి ఏరియాలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన జనరల్ బాడీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎన్నికలు నిర్వహిస్తే ఏఐటీయూసీ గెలుస్తోందని తెలిసి యాజమాన్యం కాలయాపన చేస్తోందన్నారు. కొన్ని తొత్తు యూనియన్ నాయకులను సింగరేణి సంస్థ చంకలో వేసుకుని ఆడిందే ఆటగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఎన్నికలు జరుపకుంటే అన్ని కార్మిక సంఘాలకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ సాధించిన హక్కులపై కార్మికులకు వివరించి యూనియన్‌ను బలోపేతం చేయాలని నాయకులకు సూచించారు. సమావేశంలో యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు సుదర్శన్, శ్రీనివాస్, తిరుపతి, రాజేశం, మనోహర్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉంది

- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
- ఆసిఫాబాద్‌లో సంకల్ప దీక్ష


దీక్షలో కూర్చున్న భట్టి విక్రమార్క, నాయకులు

ఆసిఫాబాద్: దేశ ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. రాహుల్ గాంధీపై పార్లమెంట్‌లో అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కోరుతూ ఆసిఫాబాద్ మండలం బూర్గుడ పాదయాత్ర క్యాంపు వద్ద ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పార్టీశ్రేణులతో కలిసి సంకల్పదీక్ష చేపట్టారు. ముందుగా అంబేద్కర్, మహాత్మాగాంధీ, ఇందిరాగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భట్టి మాట్లాడారు. ప్రజాస్వామ్యం, సామ్యవాదం, లౌకికవాదాన్ని రక్షించడం కోసం మాట్లాడుతున్న రాహుల్ గాంధీని కాపాడుకోవడానికి సంకల్పదీక్ష స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నాడు రవి అస్తమించని సామ్రాజ్యాన్ని సత్యాగ్రహదీక్ష సంకల్పంతో జయించి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన ఘనమైన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి ఉందన్నారు. అదానీ, లలిత్ మోదీ, నీరవ్ మోదీలకు సహకరిస్తున్న కేంద్రాన్ని ప్రశ్నిస్తున్న రాహుల్‌గాంధీ గొంతును అడ్డుకునేందుకు చేసిన కుట్రలో భాగమే ఈ అనర్హత వేటని పేర్కొన్నారు. డీసీసీ అధ్యక్షులు విశ్వప్రసాదరావు, సురేఖ, పీసీసీ జనరల్ సెక్రెటరీ సరస్వతి, పీసీసీ సభ్యులు రాథోడ్ గణేశ్ పాల్గొన్నారు.

'ఏలేటి' ఇంటిపై నోటీస్


నోటీస్ అతికిస్తున్న పోలీసులు

నిర్మల్‌టౌన్: రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిపై ఈనెల21న మీడియా సమావేశంలో నిరాధార ఆరోపణలు చేసిన ఏఐసీసీ అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డిపై బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడి ఫిర్యాదు మేరకు శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు నోటీసులు ఇవ్వడానికి మహేశ్వర్‌రెడ్డి ఇంటికి ఆదివారం వెళ్లారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో ఇంటిగోడపై అంటించారు. మహేశ్వర్‌రెడ్డి తాను చేసిన వ్యాఖ్యలకు ఆధారాలు ఫొటోలు, వీడియోలు ఉంటే ఈనెల 28న పట్టణ ఎస్సై గంగాధర్‌కు ఇవ్వాలని పట్టణ సీఐ మల్లేశ్ తెలిపారు.